


14 నుంచి ఇంటి వద్దే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

కలెక్టరేట్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 14 నుంచి ఇంటింటికీ వెళ్లి క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. క్యాన్సర్‌పై విజయం స్ర్కీనింగ్‌తోనే సాధ్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ప్రతి ఇంటికీ వైద్య సిబ్బంది వెళ్లి రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్‌తోపాటు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తారని కలెక్టర్ వెల్లడించారు. వీటికి సంబంధించిన పోస్టర్లను కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం ఆవిష్కరించారు.



బడ్జెట్ ప్రాధాన్యతలను వివరిస్తున్న ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

అభివృద్ధి.. సంక్షేమానికి ప్రాధాన్యం

శాసనసభలో సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమం రెండింటికీ సమ ప్రాధాన్యం లభించింది. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, పారిశ్రామిక రంగానికి, నైపుణ్య అభివృద్ధికి పెద్ద పీట వేశాం. రూ.32,712 కోట్ల మూలధన వ్యయంతో ఉత్పాదనకు, అభివృద్ధికి తోడ్పాటు ఇచ్చాం. జగన్ రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి బాధ్యత లేకుండా అసెంబ్లీ సమావేశాలకు మొహం చాటేశారు. వికసిత ఆంధ్ర, వికసిత భారత్‌లో భాగస్వామ్యం కావడానికి ఈ బడ్జెట్ ఎంతగానో ఉపయోగపడుతుంది.

\- మంత్రి కొండపల్లి శ్రీనివాస్





- బడ్జెట్‌లో వ్యవసాయానికి సంతృప్తికర కేటాయింపులు
- రైతుల సంక్షేమానికీ పెద్దపీట
- సహకార రంగాలకు ప్రాధాన్యం
- పీఏసీఎస్‌లకు పూర్వ వైభవం
- బడ్జెట్‌పై ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- రోడ్లు మరమ్మతులకూ పెద్దపీట

వ్యవసాయ ఆధారిత జిల్లాగా ఉన్న విజయనగరానికి కొత్త బడ్జెట్‌తో భరోసా లభించింది. గత ప్రభుత్వం రద్దు చేసిన పథకాలు, రాయితీలను పునరుద్ధరించాలని నిర్ణయించడాన్ని రైతులు స్వాగతిస్తున్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో సోమవారం బడ్జెట్ ప్రవేశపెట్టారు. నాలుగు నెలల కాలానికి రూ.2.94 లక్షల కోట్ల ప్రతిపాదనలతో బడ్జెట్‌ను తీసుకొచ్చారు. అదే సమయంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రూ.43,402 కోట్లతో ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అన్నదాత సుఖీభవ పథకం నుంచి భూసార పరీక్షలు, ప్రకృతి వ్యవసాయం..ఇలా అన్నింటికీ నిధులు కేటాయించారు. సహకార రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. పీఏసీఎస్‌లకు పూర్వ వైభవం తీసుకొచ్చే దిశగా అడుగులు వేశారు.

సాగుకు భరోసా

విజయనగరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో రైతులకు అగ్రప్రాధాన్యం ఇవ్వడం ద్వారా జిల్లా అన్నదాతలకు కూడా ఆసరా లభించనుంది. గత ప్రభుత్వ విధానాలకు చెక్ పెడుతూ కొత్త పంథాలో సాగుకు కొండంత అండ అందించే దిశగా బడ్జెట్‌లో కేటాయింపులు ప్రస్ఫుటమవుతున్నాయి. అన్నదాత సుఖీభవ(ఒకనాటి రైతు భరోసా) పథకానికి రూ.4500 కోట్లు కేటాయించారు. ఇది నాలుగు నెలల బడ్జెట్ అయినా కూడా సంక్రాంతికి ఈ పథకం అమలు చేసేందుకు నిధులు కేటాయించినట్టు ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. దీనిపై రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో 2.63 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది.

విత్తనాలు, ఎరువులకు రాయితీ

గత ఐదేళ్లలో విత్తన రాయితీ అంతంతమాత్రంగా అమలు చేశారు. రైతులు విత్తనాలు అందక ఇబ్బందులు పడ్డారు. ఈసారి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా రాయితీ విత్తనాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విత్తన రాయితీకి బడ్జెట్‌లో రూ.240 కోట్లు కేటాయించారు. అటు ఎరువుల రాయితీకి మరో రూ.40 కోట్లు కేటాయించారు. దీంతో జిల్లా రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

యాంత్రీకరణకు పెద్దపీట

వ్యవసాయ యాంత్రీకరణకు రూ.187 కోట్లను రాష్ట్రస్థాయిలో కేటాయించారు. డిజిటల్ వ్యవసాయానికి సైతం రూ.41.77 కోట్లు కేటాయించారు. దీంతో మళ్లీ రాయితీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాల పంపిణీ ప్రారంభంకానుంది. వైసీపీ హయాంలో యంత్ర సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 325 కేంద్రాలను ఏర్పాటుచేయగా ఇవన్నీ వైసీపీ నేతల సొంత అవసరాలకే పనికి వచ్చాయి. కాగా గతం మాదిరిగా రాయితీపై వ్యవసాయ పరికరాలను కూటమి ప్రభుత్వ అందించనుంది. డిజిటల్ వ్యవసాయంలో భాగంగా డ్రోన్ల సేవలను కూడా అందుబాటులోకి తేనుంది.

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం

ప్రకృతి వ్యవసాయానికి ఈసారి పెద్దపీట వేశారు. బడ్జెట్‌లో రూ.422 కోట్లు కేటాయించారు. 2016లో జిల్లాలో టీడీపీ ప్రభుత్వమే ప్రకృతి వ్యవసాయాన్ని పరిచయం చేసింది. 9 మండలాల పరిధిలో 3,161 మంది రైతులను ఎంపిక చేసింది. పండ్ల మొక్కలు, కూరగాయల సాగు వంటి విషయంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా ప్రోత్సాహమందించింది. అటు తరువాత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది.

అనుబంధ రంగాలకూ ప్రాధాన్యం

వ్యవసాయ అనుబంధరంగాలకు ఈసారి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచారు. ఉద్యాన శాఖకు ఏకంగా రూ.3,649 కోట్లు, పట్టు పరిశ్రమలకు రూ.108 కోట్లు, వ్యవసాయ మార్కెటింగ్‌కు రూ.314.80 కోట్లు, సహకర శాఖకు రూ.308 కోట్లు కేటాయించారు. జిల్లాలో వరి, మొక్కజొన్న, పత్తి వంటి సంప్రదాయ పంటలతో పాటు ఉద్యాన శాఖ పరిధిలోకి వచ్చే పంటలను సైతం రైతులు పండిస్తున్నారు. గత ఐదేళ్లలో ఈ శాఖకు ఎటువంటి కేటాయింపులు లేవు.

అన్నింటికీ సంతృప్తిగా కేటాయింపులు

గుంతలు లేని రోడ్లు ఉండాలని ఆకాంక్షించిన కూటమి ప్రభుత్వం ఆ మేరకు బడ్జెట్‌లో రూ.600 కోట్లు పైగా కేటాయించింది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో పాటు విద్య, వైద్యానికీ అధిక ప్రాధాన్యం కల్పించింది. దీపం పథకం-2 కింద ఇప్పటికే ఏడాదికి మూడు సిలిండర్లను ఇవ్వాలని నిర్ణయించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించింది. ఇందుకోసం నిధులు కేటాయించింది. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల హామీ నెరవేర్చేందుకు గాను అందుకు తగిన ప్రతిభా, సామర్థ్యం మెరుగుకు 192 నైపుణ్య కళాశాలలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సీజీఎఫ్ నిధులతో రాష్ట్రంలోని 160 దేవాలయాలు అభివృద్ధి చేయదలిచారు.



అసెంబ్లీలో బడ్జెట్ పుస్తకాలతో ఎమ్మెల్యేలు లలితకుమారి, అదితి

సాగుకు ప్రాధాన్యం ఇచ్చారు



వ్యవసాయానికి బడ్జెట్‌లో కేటాయింపులు పెరగడం హర్షించదగ్గ పరిణామం. గత ఐదేళ్లలో రైతుభరోసా తప్ప ఎటువంటి రాయితీలు, పథకాలు అందలేదు. రూ.13500 ఇస్తున్నామని చెప్పి దశాబ్దాలుగా అందిస్తున్న పథకాలను సైతం నిలిపివేశారు. ఇప్పుడు వ్యవసాయానికి సంబంధించి అన్ని అంశాలకు సమ ప్రాధాన్యం ఇవ్వడం బాగుంది.

\- కేవీఎస్ఎన్‌జీ రాజు, రైతు, డెంకాడ

సాగుకు రాయితీలు పెంచడం బాగుంది



గతంలో రైతుకు చాలా రకాల రాయితీలు దక్కేవి. గత ఐదేళ్లలో నిలిచిపోయాయి. వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర లేదు. విత్తనాలు, ఎరువుల ధరలు మాత్రం పెరిగిపోయేవి. సాగు రాయితీలు, కేటాయింపులు పెంచడం బాగుంది.

\- కనకల మురళి, రైతు, గంగచోళ్లపెంట

పేదల సంక్షేమానికి ప్రాధాన్యం



అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. సూపర్ సిక్స్ హామీల అమలుకు పెద్దపీట వేశారు. ఇప్పటికే సామాజిక పెన్షన్ల మొత్తాన్ని పెంచారు. విద్య, వైద్యం, వ్యవసాయం తదితర రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. మొత్తంగా బడ్జెట్ అందరికీ ఆమోదయోగ్యంగా ఉంది.

\- ఎంపీజీ ఈశ్వరరావు, విజయనగరం

ఆలయాలకు ఆసరా



ఆలయాల అభివృద్ధి అర్చకుల సంక్షేమం కోసం బడ్జెట్ కేటాయింపులు హర్షణీయం. ధూపదీప నైవేద్యాల కింద రూ.5 వేలు ఇచ్చేవారు. దానిని రెట్టింపు చేశారు. అభివృద్ధికి సంబంధించి 160 దేవాలయాలను ఎంపిక చేశారు. వాటికి మహర్దశ లభించనుంది. అర్చకుల వేతనాల్లో కూడా మార్పులు చేశారు.

\- వాయునందన శర్మ, రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన ఉపాధ్యక్షుడు



పెంట గ్రామంలో వరిచేలను కుప్పలుగా వేస్తున్న రైతులు

తుఫాన్.. టెన్షన్

- వరిని కాపాడుకునేందుకు రైతుల పరుగులు

బొబ్బిలి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉండబోతోందని వాతావరణ శాఖ హెచ్చరిస్తుండడంతో అన్నదాతల గుండెల్లో గుబులు రేగింది. వరిపంటను వర్షాల నుంచి కాపాడుకునేందుకు ఉరుకులు, పరుగులు మొదలు పెట్టారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో వరిచేలను కోసి పొలా ల్లోనే ఆరబెట్టారు. బొబ్బిలి మండలంలోని అలజంగి, కారాడ, పెంట, పారాది, నారసింహునిపేట, బూర్జివలస, పనుకువలస, మల్లమ్మపేట, గొల్లపల్లి, పాతబొబ్బిలి తదితర ప్రాంతాల్లో పంట కోతలు జోరుగా సాగుతున్నాయి. కూలీలు దొరక్క రైతులు అవస్థలు పడుతున్నారు. కొంతమంది నూర్పులు ప్రారంభించి ధాన్యాన్ని అమ్ముకునేందుకు ప్రయత్నిస్తుండగా మరికొంతమంది పంటపొలాల్లోనే కోసిన వరిపంటను కుప్పలుగా వేస్తున్నారు. వరి నాట్లు వేసిన దగ్గర నుంచి ప్రతికూల వాతావరణ ప్రభావంతో సతమతమవుతూనే ఉన్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆజాద్ సేవలు స్ఫూర్తిదాయకం: కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జాతికి అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ అంబేడ్కర్ అన్నారు. భారతదేశ ప్రథమ విద్యాశాఖ మంత్రి జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అబుల్ కలామ్ సమాజానికి చేసిన సేవలకు గుర్తుగా ఆయన పుట్టిన రోజును జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీ సంక్షేమ దినోత్సవంగా ప్రభుత్వం నిర్వహిస్తోందని చెప్పారు. ఆ మహనీయుని ఆశయాలు, బోధనలు జాతికి సదా అనుసరణీయమని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీనివాసమూర్తి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఆర్ఎస్ జాన్, జిల్లా ఖజానా అధికారి కుమార్, మైనార్టీ సోషల్ వర్కర్ షేక్ అబ్దుల్ కరీమ్ వాజిద్ తదితరులు పాల్గొన్నారు.



మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

చివరి రోజు రెండు నామినేషన్లు

- ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఓ ప్రక్రియ కొలిక్కి



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి సుబ్బలక్ష్మి

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): శాసన మండలి స్థానిక సంస్థల నియోజకవర్గం ఉప ఎన్నికకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ సోమవారంతో ముగిసింది. ఇప్పటి వరకూ మూడు సెట్ల నామినేషన్లు దాఖలు అయినట్లు జేసీ, రిటర్నింగ్ ఆఫీసర్ సేతు మాధవన్ వెల్లడించారు. చివరి రోజున ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఎస్.కోట మండలం బొడ్డవరానికి చెందిన ఇందుకూరి సుబ్బలక్ష్మి ఇండిపెండెంట్ అభ్యర్థిగా రెండు సెట్ల నామినేషన్లు అందజేశారు. ఎస్.కోట మండలం వని గ్రామానికి చెందిన కారుకొండ వెంకటరావు ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ పత్రాలు ఇచ్చారు. ఇప్పటికే వైసీపీ నుంచి శంబంగి వెంకట చినప్పలనాయుడు మూడు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. సోమవారం బిఫారంను కూడా రిటర్నింగ్ అధికారికి అందజేశారు. నామినేషన్ పత్రాల పరిశీలన మంగళవారం జరుగనుంది.

ఉప ఎన్నిక ఏర్పాట్లపై పరిశీలకుడు నాయక్ సమీక్ష

శాసన మండలి ఉప ఎన్నిక ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల పరిశీలకులుగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి ఎంఎం నాయక్ సమీక్షించారు. సోమవారం జిల్లాకు వచ్చిన ఆయన ముందుగా జిల్లా పరిషత్ అతిథిగృహానికి చేరుకున్నారు. ఆయనకు కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతుమాధవన్, డీఆర్వో శ్రీనివాస్ మూర్తి, ఆర్డీవో కీర్తి స్వాగతం పలికారు. అనంతరం పరిశీలకుడు శాసన మండలి ఉప ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు.

శంభోశంకర

- కార్తీక రెండో సోమవారం ఆలయాలకు పోటెత్తిన భక్తులు

హరహర మహాదేవ.. శంభోశంకర నినాదంతో శివాలయాలు మార్మోగాయి. కార్తీక రెండో సోమవారం పురస్కరించుకుని శివుడి దర్శనానికి భక్తులు బారులుతీరారు. పుణ్యగిరి, జయతి, రామతీర్థం, సంగాం, విజయనగరం రింగురోడ్డులోని పశుపనాథేశ్వరస్వామి తదితర ఆలయాలు రోజంతా కోలాహలంగా కనిపించాయి. భక్తులతో కిక్కిరిసిపోయాయి. వేకువ జామున లేచి పుణ్యస్నానాలు ఆచరించాక భక్తులు స్వామి దర్శనానికి క్యూ కట్టారు. అరటి దొప్పల్లో దీపాలు వెలిగించడంతో కార్తీక శోభ వెల్లివిరిసింది.



6లో


విజయనగరం: పశుపనాథేశ్వర స్వామికి పూజలు

నెలాఖరులోగా పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ: జేసీ

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నెలాఖరులోగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ పూర్తి చేయాలని జేసీ సేతు మాధవన్ ఆదేశించారు. డిసెంబరు నుంచి లావాదేలన్నీ కంప్యూటర్ ద్వారానే జరుగుతాయని తెలిపారు. పీఏసీఎస్‌ల సీఈవోలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, బ్రాంచి మేనేజర్లు, పర్సన్ ఇన్‌చార్జీలు, డీసీసీబీ మేనేజర్లతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ జరుగుతుండగా, మన రాష్ట్రంలో ప్రగతి గణనీయంగా ఉందని చెప్పారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు నెలాఖరులోగా కంప్యూటరీకరణను ఎట్టి పరిస్థితిలో పూర్తి చేయాల్సిందేనని ఆదేశించారు. పీఏసీఎస్‌లలో సుమారు 2,42,000 మంది సభ్యులుగా ఉన్నప్పటికీ చురుగ్గా ఉన్న సభ్యుల సంఖ్య చాలా తక్కువగా ఉందన్నారు. చురుగ్గా లేని సభ్యులను సర్వజన సభలో తీర్మానం పెట్టి తొలగించాలని సూచించారు. ప్రతిఒక్కరి నుంచి ఆధార్ నంబర్ సేకరించాలన్నారు. సమావేశంలో డీసీవో రమేష్, డీసీసీబీ సీఈవో ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● అశ్రద్ధ చేస్తే ప్రాణాలకే ముప్పు ● వ్యాక్సిన్‌లతో నివారణ సాధ్యం ● నేడు ప్రపంచ న్యూమోనియా నివారణ దినం

అమ్మో.. న్యూమోనియా



విజయనగరం రింగురోడ్డు/ కొమరాడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): శీతాకాలం.. వర్షాకాలంలో వీచే చల్లగాలుల ప్రభావంతో పాటు అలవాట్ల కారణంగా ఊపిరితిత్తుల సామర్థ్యం తగ్గుతుంది. ఇతర అవయవాలపై దీని ప్రభావం పడి.. అనారోగ్యానికి గురవుతుంటారు. ఇలా బ్యాక్టీరియా, వైరస్‌ల కారణంగా ఊపిరితిత్తులు ఇన్‌ఫెక్షన్‌కు గురికావడాన్ని న్యూమోనియా అంటారు. ఇది చలికాలంలో తీవ్ర ప్రభావం చూపుతుంది. ఐదేళ్ల లోపు చిన్న పిల్లలు, 65 ఏళ్ల పైబడిన వారిలో న్యూమోనియా ప్రమాదం ఎక్కువగా ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. న్యూమోనియా మరణాల రేటు ప్రపంచ వ్యాప్తంగా ఏటా 14 నుంచి 30 శాతం ఉండగా... భారత్‌లో 23 శాతంగా ఉందని గణాంకాలు చెబుతున్నాయి. విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రిలో నెలకు 200 నుంచి 300 కేసులు నమోదవుతున్నట్టు వైద్యాధికారులు చెబుతున్నారు. నేడు ప్రపంచ న్యూమోనియా నివారణ దినం సందర్భంగా ఈ వ్యాధి లక్షణాలు, నిర్ధారణ పరీక్షలు, చికిత్సా పద్ధతులు, తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలను తెలుసుకుందాం.


● స్ట్రెప్టోకోకస్ న్యూమోనియా అనే ఒక రకమైన బ్యాక్టీరియా, ఇన్‌ఫ్లు ఎంజా అనే వైరస్ న్యూమోనియాకి కారణమవుతు న్నాయి. ఈ బ్యాక్టీరియా ఊపిరితిత్తులపై దాడి చేసినప్పుడు న్యూమోనియాకు కారణమవుతుంది. ఇది మెదడుకి సంబంధించిన లైనింగ్‌పై దాడి చేసినప్పుడు మెనింజైటీస్‌కు కారణమవుతుంది. దీనివల్ల తీవ్రమైన పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉంది.

వ్యాప్తి ఇలా..

న్యూమోనియా ఉన్న వ్యక్తులు ముఖానికి ఖర్చీఫ్ పెట్టుకోకుండా దగ్గినా, తుమ్మినా వారి నోటి తుంపర్ల ద్వారా పక్కన ఉండే వారికి వ్యాధి సోకుతుంది.. వైరస్, బ్యాక్టీరియాల ద్వారా ఇది వ్యాప్తి చెందే అవకాశం ఉంది. వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉండేవారు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడే వారు, పొగ తాగడం, మద్యపానం అలవాటు ఉన్నవారు, ఊపిరితిత్తుల సమస్యలు ఉన్న వారికి ఈ వ్యాధి సోకే అవకాశాలు అధికం.

నిర్ధారణ ఎలాగంటే..

ఛాతి ఎక్సరే, సిటీ స్కాన్ పరీక్ష, రక్తపరీక్షలు, కెల్ల, బ్రాంకో స్కోపీ తదితర పరీక్షల ద్వారా వైద్యులు ఈ వ్యాధి నిర్ధారణ చేస్తారు.



నివారణ ఇలా..

- పిల్లలకు చిన్న వయస్సులో ఇచ్చే బీసీజీతో పాటు నిమోకోకల్ వ్యాక్సిన్ ఇవ్వడం వల్ల దీనిని నివారించవచ్చు.
- పొగ తాగే అలవాటు ఉంటే జ్వరం, దగ్గు, ఊపిరి అందకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే ఆ అలవాటును మానేయాలి.
- బయట వాతావరణంలో పొగ ఉంటే దానిని నివారించేందుకు చర్యలు చేపట్టాలి.
- ఆస్తమా, బ్రాంకైటీస్ ఉన్నవారు తప్పనిసరిగా నియంత్రణ చికిత్స తీసుకోవాలి.
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల రోగ నిరోధక శక్తి పెరిగి వ్యాధి అదుపులో ఉంటుంది.

వీరికి ప్రమాదం ఎక్కువ

60 ఏళ్ల పై బడిన వారు, రెండేళ్ల లోపు చిన్నపిల్లలు ఆస్తామా ఫైబ్రోసిస్, పల్మనరీ, పార్కిన్సన్స్ వ్యాధి ఉన్న వారికి న్యూమోనియా ప్రమాదాన్ని పెంచుతుంది. ఆసుపత్రిలో దీర్ఘకాలికంగా చికిత్స పొందేవారు, గర్భవతులు, క్యాన్సర్‌కు కీమోథెరపీ చేయించుకుంటున్న రోగులు, హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గి, న్యూమోనియా తీవ్రమై మరణించే ప్రమాదం ఉంది. జ్వరం, దగ్గు, ఊపిరి అందకపోవడం వంటి లక్షణాలు రెండు, మూడు రోజులు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. డయాబెటిక్, పక్షవాతం, ఆస్తమా వ్యాధిగ్రస్తులు, గర్భిణుల్లో ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. దీంతో రక్తానికి ఇన్‌ఫెక్షన్ సోకడం, మూత్రపిండాలు దెబ్బతినడం, మెదడుపై ప్రభావం పడతాయి. ఇలాంటి తరుణంలో నిర్లక్ష్యం చేస్తే మృత్యువాత పడవచ్చు.

లక్షణాలు ఇవీ..

న్యూమోనియా 74 శాతం అన్ని వయస్సుల వారికి వస్తుంది. ప్రధానంగా ఐదేళ్ల లోపు పిల్లలు.. 60 ఏళ్లు దాటిన వృద్ధుల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండడం వల్ల దీని బారిన పడుతున్నారు. ఎడతెరపి లేని దగ్గు, కెల్ల పడడం, కెల్ల పసుపు లేదా పచ్చగా ఉండడం, దగ్గినప్పుడు రక్తం పడడం, ఆయాసం, అలసట, ఛాతిలో నొప్పి, ఊపిరి పీల్చుకోవడం కష్టంగా ఉండడం, జ్వరం, చలి, వణుకు, తలనొప్పి, కండరాల నొప్పులు, వికారం, వాంతులు, పిల్లల్లో పాలు తాగలేక పోవడం తదితర లక్షణాలు కన్పిస్తాయి. చలికాలంలో న్యూమోనియా కేసులు ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది.



జాగ్రత్తలు తప్పనిసరి

రోగులు త్వరగా కోలుకోవడానికి వైద్యుల సలహా మేరకు క్రమం తప్పకుండా మందులు వాడాలి. ఎక్కువగా విశ్రాంతి తీసుకోవాలి. ధూమపానం, మద్యపానం ఆపివేయాలి. దగ్గినా, తుమ్మినా ముఖానికి చేతి రుమాలు అడ్డుపెట్టుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. వ్యాధికి గురికాకుండా పుట్టిన ప్రతి బిడ్డకు వ్యాక్సిన్‌లు వేయించాలి. వ్యాధి సోకకుండా నివారించే వ్యాక్సిన్‌లు ఇన్‌ఫ్లూయాంజా, న్యూమోకోకల్ వాక్సిన్‌ను పెద్దలు వేసుకోవడం ద్వారా దీనిని నివారించవచ్చు.

- డాక్టర్ టి.వెంకటేశ్వరరావు, పల్మనాలజిస్ట్

యాంటీ బయోటిక్స్ ద్వారా చికిత్స

న్యూమోనియాకు తగిన మోతాదులో యాంటీ బయోటిక్ చికిత్స అందించాలి. సీబీపీసీ ఎక్స్‌రే వంటి పరీక్షలతో పాటు ఛాతి, సిటీ స్కాన్, కెల్ల పరీక్షల ద్వారా వ్యాధి తీవ్రతను గుర్తించవచ్చు. ఆ తరువాత తీవ్రతను బట్టి రోగికి చికిత్సను అందించవచ్చు.

- డాక్టర్ తెర్లి జగన్మోహన్‌రావు,
జిల్లా ప్రోగ్రాం అధికారి, పార్వతీపురం మన్యం జిల్లా



ఆలోచింపజేసిన మతమా.. మానవత్వమా?


మతమా.. మానవత్వమా? నాటికలోని ఓ సన్నివేశం

విజయనగరం రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని గురజాడ కళాభారతి ఓపెన్ ఆడిటోరియంలో గత మూడు రోజులుగా నిర్వహించిన ఆహ్వాన నాటిక పోటీలు సోమవారం రాత్రితో ముగిశాయి. చివరి రోజున ప్రదర్శించిన 'మతమా.. మానవత్వమా?' నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. రోజుకు రెండు నాటికల చొప్పున మూడు రోజుల్లో ఆరు నాటికలను ప్రదర్శించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల్లోని వివిధ నాటక సమాజాల నుంచి కళాకారులు తమ నటనతో ప్రేక్షకులను రంజింపజేశారు.

నాటికలకు ఆదరణ తగ్గలేదు

నాటికలకు నేటికీ ఆదరణ తగ్గలేదనడానికి రాష్ట్రంలో జరుగుతున్న వివిధ నాటక పరిషత్‌లే రుజువు చేస్తున్నాయని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. సినిమాలు, సోషల్ మీడియా విస్తృతమైన ఈ రోజుల్లో కూడా నాటకాలను చూసేందుకు ప్రేక్షకులు వస్తుండడం ముదావహమన్నారు. ప్రతి ఏటా రాష్ట్ర వ్యాప్తంగా నాటిక పరిషత్‌లు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వాలు అందించే సహకారంతో ముందుకు వెళ్లాలని కళాకారులకు సూచించారు. సమాజానికి నాటికలు దిక్సూచిలా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో అభినయ సంస్థ నిర్వాహకులు శ్రీనివాసరావు, గద్దె వరప్రసాద్, లోక్‌సత్తా పార్టీ నేత భీశెట్టి బాబ్జీ, న్యాయవాది ఎస్‌వీఆర్ఎం రాజు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

వేపాడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నీలకంఠరాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ వెంకటరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14 బాల్‌బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీలకు బి.యశ్వంత్, జ్ఞానప్రసన్న ఎంపికయ్యారన్నారు. అండర్-14 త్రో బాల్ పోటీలకు సీహెచ్ వంశీ, అండర్-17 బాస్కెట్ బాల్ పోటీలకు టి.లోకేష్ ఎంపికయ్యారని తెలిపారు. అండర్-19 బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు పి.కుమార్ ఎంపికైనట్టు చెప్పారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు

● ప్రథమ స్థానంలో శ్రీకాకుళం, కడప జట్లు


మూడో స్థానంలో నిలిచిన విజయనగరం బాలుర జట్టు

భోగాపురం, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా భోగాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో గత మూడు రోజులుగా నిర్వహించిన 68వ రాష్ట్ర స్థాయి అండర్-14 బాలురు, బాలికల వాలీబాల్ క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు.. ఈ పోటీల్లో అండర్-14 బాలురు, బాలికల నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు డీఈవో మాణిక్యంనాయుడు బహుమతులు అందజేశారు. అండర్-14 బాలుర వాలీబాల్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. విశాఖపట్నం ద్వితీయ, విజయనగరం తృతీయ స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో కడప, ద్వితీయ స్థానంలో గుంటూరు, తృతీయ స్థానంలో పశ్చిమగోదావరి జిల్లాలు నిలిచాయి. ఈ జట్ల క్రీడాకారులకు ట్రోఫీ, పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణంరాజు, ఎంఈవో చంద్రమౌళి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జాతీయ స్థాయి అండర్-14 వాలీబాల్ క్రీడలకు ఎంపికైన బాలురు, బాలికల జట్లు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

భోగాపురం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): అండర్-14 జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు రాష్ట్రం నుంచి బాలురు, బాలికలను ఎంపిక చేశామని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణంరాజు తెలిపారు. 13 జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారుల్లో బాగా రాణించిన బాలురు, బాలికల నుంచి జాతీయ స్థాయిలో పాల్గొనేందుకు 18 మంది చొప్పున ఎంపిక చేశామని చెప్పారు. వచ్చేనెల 10 నుంచి 14వ తేదీ వరకు వారణాశిలో జరగబోయే అండర్-14 జాతీయ స్థాయిలో జరగబోయే క్రీడా పోటీల్లో బాలుర నుంచి 12 మంది, బాలికల నుంచి 12 మంది మాత్రమే పాల్గొంటారన్నారు. బాలుర సెలక్షన్ కమిటీగా రజనీనాయక్, బి.వైకుంఠరావు, ఎ.విజయ్‌కుమార్, బాలికల సెలక్షన్ కమిటీగా కృష్ణంరాజు, రామచంద్రుడు, సుస్మిత వ్యవహరించారన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వారిలో విజయనగరం జిల్లాకు చెందిన ఎ.సంతు, వి.రాఘవేంద్ర, జి.రేవతి ఉన్నారని చెప్పారు. పీడీలు సింగిడి నాగన్న, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

ఓం నమశ్శివాయ

● భక్తులతో కిక్కిరిసిన శివాలయాలు
● స్వామికి ప్రత్యేక అభిషేకాలు

కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా జిల్లాలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము 3 గంటల నుంచే స్వామి దర్శనానికి ఆలయాల వద్ద భక్తులు బారులుదీరారు. అభిషేకాలు చేశారు. విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, ఎస్.కోట, పాచిపెంట తదితర ప్రాంతాల్లోని శివాలయాల్లో పెద్ద ఎత్తున భక్తులు పూజలు చేశారు.

- ఆంధ్రజ్యోతి బృందం


ఎస్.కోట: పుణ్యగిరి పుట్టధార వద్ద భక్తుల స్నానాలు


బొబ్బిలి రూరల్: అలజంగి శివాలయంలో..


విజయనగరం: పశుపతినాథ ఆలయంలో సామూహిక అభిషేకాలు


జామి: స్వర్ణాకర్ష త్రిపురాంతక స్వామికి పూజలు


కొత్తవలస: తుమ్మికాపల్లి గేట్ వద్ద ఓం సదనంలో...


నెల్లిమర్ల: జోగిపేటలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

అట్రాసిటీ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలి

▸▸ ఎస్పీ వకుల్ జిందాల్


అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు స్టేషన్‌ల పరిధిలో అట్రాసిటీ కేసుల్లో దర్యాప్తును వేగవంతం పూర్తి చేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి సబ్ డివిజన్‌ల పరిధిలో నమోదై, దర్యాప్తులో ఉన్న అట్రాసిటీ కేసులను ఎస్పీ వకుల్ జిందాల్ సమీక్షించి, దర్యాప్తు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అట్రాసిటీ కేసుల్లో చట్ట ప్రకారం వ్యవహరించాలని ఆదేశించారు. డీఎస్పీ స్థాయి అధికారులు విధిగా ఘటన స్థలాన్ని సందర్శించాలని, ప్రత్యక్ష సాక్షులను విచారించాలన్నారు. కేసుల దర్యాప్తును 60 రోజుల్లో పూర్తి చేసి, అభియోగ పత్రాలను న్యాయస్థానాల్లో దాఖలు చేయాలన్నారు. బాధితులకు పరిహారం సకాలంలో అందేందుకు ఎప్పటికప్పుడు ప్రతిపాదనలు సిద్ధం చేసి కలెక్టర్ కార్యాలయానికి పంపాలని, సకాలంలో పరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు పి.శ్రీనివాసరావు, ఎస్.రాఘవులు, ఎం.వీరకుమార్, సీఐ ఆర్‌వీఆర్‌కే చౌదరి, ఎస్ఐ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

● విజయనగరంలోని కంటోన్మెంట్ గూడ్‌షెడ్ వద్ద శివాలయం ప్రాంగణంలో అగ్ని ప్రమాదానికి గురైన మహిళను రక్షించిన వన్‌టౌన్ కానిస్టేబుల్ మణికంఠను ఎస్పీ వకుల్ జిందాల్ జిల్లా పోలీసు కార్యాలయంలో అభినందించి, ప్రశంసాపత్రం అందించారు.

ఎలక్షన్ పరిశీలకుడిని కలిసిన ఎస్పీ

విజయనగరం క్రైం, నవంబరు 11: (ఆంధ్రజ్యోతి) జిల్లాలో శాసనమండలి నియోజకవర్గ ఉప ఎన్నికకు ఎన్నికల పరిశీలకులుగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి, రాష్ట్ర పశు సంవర్ధకశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ సోమవారం జిల్లాకు వచ్చారు. ఎస్పీ వకుల్ జిందాల్ జిల్లా పరిషత్ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

టీడీపీ సభ్యత్వంతో ప్రమాద బీమా సౌకర్యం


సభ్యత్వ నమోదు చేస్తున్న దృశ్యం

గుర్ల, నవంబరు11(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరికీ ప్రమాద బీమా వర్తిస్తుందని పాలవలస టీడీపీ నాయకులు గేదెల అప్పలనాయుడు, గేదెల లక్ష్మి అన్నారు. పాలవలస గ్రామంలో సోమవారం టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్యులుగా చేరిన ప్రతి ఒక్కరికీ పార్టీ అండతోపాటు ప్రమాద బీమా కూడా వర్తిసుందన్నారు. ప్రశాంత్, నారాయణరావు, గౌరినాయుడు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త వహించాలి


మాట్లాడుతున్న డీఎస్పీ రాంబాబు

పాలకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు అన్నారు. ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు దొంగలించిన సవర ముఖలింగం అనే నిందితుడిని సోమవారం విలేకర్ల ముందు ఉంచారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు మీ సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదన్నారు. పోలీస్ సిబ్బంది ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు సింగన్నవలస సెంటర్ వద్ద సవర ముఖలింగాన్ని అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. సీతంపేట మండలం ఈతమానుగూడ గ్రామానికి చెందిన ముఖలింగానికి తండ్రి అడ్డాయి సింహాచలం ఉన్నారన్నారు. ఒక ప్రణాళిక ప్రకారం దొంగతనాలు చేస్తూ ఉంటాడని చెప్పారు. సీసీ కెమెరాలు లేని మార్గం ఎంచుకుని ఆ ప్రాంతంలో ముఖానికి మాస్క్ పెట్టుకొని తిరుగుతూ ఉంటాడన్నారు. సెల్‌ఫోన్లు, బైక్‌లు ఉన్నవారితో పరిచయాలు పెంచుకుని సమయం చూసి తన ప్రణాళిక అమలు చేస్తాడని చెప్పారు. ముఖలింగం వద్ద నుంచి ఐదు బైకులు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ వెల్లడించారు. పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు అయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్ఐ ప్రయోగమూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలలో జాప్యం తగదు

విజయనగరం దాసన్నపేట, నవంబరు11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వివిధ రకాల కారణాలు చూపిస్తూ, డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలలో జాప్యం చేయడం తగదని డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సీహెచ్ హరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేస్తామన్నారు. కానీ నేటికీ అమలు కాలేదన్నారు. నాలుగు నెలలు అవుతున్నా, డీఎస్సీ నోటిఫికేషన్‌పై ఊరిస్తున్నారన్నారు. నోటిఫికేషన్ విడుదలలో జాప్యం లేకుండా విద్యాశాఖ మంత్రి చూడాలని కోరారు.

ప్రతిపక్షంపై కక్ష సాధింపు తగదు

గజపతినగరం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎన్నికల హామీల ను విస్మరించిందని, దీనిపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదునెలల కాలంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలేదని సోషల్ మీడియాలో ప్రశ్నిస్తే వారిని అన్యాయంగా నిర్బంధించడం శోచనీయమన్నారు.

మాతా శిశుమరణాలపై సమీక్ష

రింగురోడ్డు, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మాత శిశుమరణాలపై సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కె.రాణి మాట్లాడుతూ జులైనెల నుంచి అక్టోబరు వరకు జిల్లాలో సంభవించిన ఏడు మాతృమరణాలు , 12 శిశుమరణాలపై సమీక్ష నిర్వహించారు. భవిష్యత్‌లో మరణాలు సంభవించకుండా క్షేత్రస్థాయినుంచి ఉన్నత శ్రేణి ఆసుపత్రులకు తరలించే విదంగా చర్యలు తీసుకోవలన్నారు. జిల్లా ఆసుపత్రుల సేవ సమన్వయ అధికారి డాక్టర్ రజనీకుమారి, సి.ఎస్.ఎస్ డాక్టర్ అరుణకుమారి, గైన కాలజీ నోడల్ అధికారి డాక్టర్ అచ్యుతకుమారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్యం కోసం చెక్కు అందజేసిన కళా

రాజాం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మెరకముడిదాం మండలం గొల్లల మర్రివలస గ్రామానికి చెందిన కొర్నాన మోహిత్ కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు రాజాం క్యాంపు కార్యాలయంలో చెక్కును సోమవారం అందజేశారు. వైద్యం కోసం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ 3,50,000 చెక్‌ను వారి కుటంబ సభ్యులు కొర్నాన లక్ష్మణరావు తదితరులకు అందజేశారు.

క్విజ్‌పోటీల్లో సంకిలి హైస్కూల్ ప్రథమం

రేగిడి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రేగిడి విశ్వసాయి మందిరం ఆధ్వర్యంలో భగవాన్ శ్రీసత్యసాయి 99వ జన్మదినం పురష్కరించుకుని సోమవారం మండలస్థాయి క్విజ్‌పోటీలు నిర్వహించారు. మొత్తం 10 హైస్కూల్స్ నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొనగా, సంకిలి, రేగిడి హైస్కూల్స్‌ను ప్రథమ, ద్వితీయస్థానంలో నిలిచాయి.

ఎల్‌టీపీ సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కోశాధికారి ఆదినారాయణ

విజయనగరం దాసన్నపేట, నవంబరు 11: రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌టీపీల సమస్యలను పరిష్కరించాలని ఎల్‌టీపీ అసోసియేషన్ రాష్ట్ర ఛైర్మన్ రాము కోరారు. సోమవారం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రంలోని 26 జిల్లాల ఎల్‌టీపీ(ఇంజినీర్లు) హాజరయ్యారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, డీపీఎంఎస్ వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు ఎప్పటికప్పుడు ఎదురవ్వడంతో ప్లాన్‌లు దరఖాస్తు చేసుకునేందుకు సమయం వృథా అవుతుందన్నారు. భవన నిర్మాణాల లేఅవుట్‌లకు సంబంధించి సాఫ్ట్‌వేర్‌ని త్వరితగతిన అప్‌గ్రేడేషన్ చేసి ఆన్‌లైన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డీపీఎంఎస్ వెబ్‌సైట్‌ను సక్రమంగా పూర్తి చేస్తే ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తవన్నారు. కార్యక్రమంలో ఎల్‌టీపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాంబాబు, కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి ఆదినారాయణ, జిల్లా అధ్యక్షుడు ఆదినారాయణ, ఉపాధ్యక్షుడు నాగేందర్, ఇతర ప్రతినిధులు అల్తి శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావుతో పాటు ఎల్‌టీపీఎస్‌లు పాల్గొన్నారు.

వీఆర్వోలకు పనుల భారం తగ్గించాలి


వినతిపత్రం అందజేస్తున్న వీఆర్వోలు

వేపాడ, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ పనులతో సతమతమవుతున్న సమయంలో గ్రామ రెవిన్యూ అధికారులకు ఇతరశాఖల పనులు కేటాయించడం వల్ల ఒత్తిడికి గురై వ్యాధుల భారిన పడుతున్నామని, వీఆర్వోలపై పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ మండల వీఆర్వోలు తహసీల్దార్ జే.రాములమ్మకు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు రాష్ట్ర స్థాయిలో సీసీఎల్ఏ వారు జారీ చేసిన జీవో ప్రకారం ఇతర శాఖల పనులను కేటాయించవద్దని వీటిని జిల్లా, మండల స్థాయిలో తక్షణమే అమలు చేసి గ్రామ రెవెన్యూ అధికారులకు ఇబ్బందులు లేకుండా చేయాలని కోరారు. జిల్లా అధికారులకు తమ కష్టాలని నివేదించాలని మండల వీఆర్వోల సంఘం నాయకులు డెక్క ప్రసాదు, బాల భాస్కర్, శ్రీనివాసరావు తదితర వీఆర్వోలు తహసీల్దార్‌ను డిమాండ్ చేశారు.

'మా డిమాండ్లు నెరవేర్చండి'


వినతి పత్రం సమర్పిస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లు

చీపురుపల్లి, నవంబరు11(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లు పరిష్కరించాలని ఆర్‌ఈసీఎస్ పరిధిలో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు సోమవారం ఆర్‌ఈసీఎస్ ప్రధాన కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ఎస్. రాధాకృష్ణకు వినతిపత్రం అందజేశారు. సంస్థలో తాము మూడున్నరేళ్లుగా పని చేస్తున్నామని, అయినప్పటికీ సర్వీసు క్రమబద్ధీకరణ జరగలేదన్నారు. ఉద్యోగ భద్రత లేదని, పనిలో కూడా తగిన భద్రత లేదన్నారు. తమ ప్రొబేషన్ పీరియడ్‌ను దాటి పని చేస్తున్నా, సర్వీసు క్రమబద్ధీకరణ జరపకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా, తమ ఇబ్బందులను గుర్తించి తగిన న్యాయం చేయాలని వారు కోరారు. యూనియన్ అధ్యక్షుడు ఎం. చిన్నంనాయుడు, కార్యదర్శి ఆర్. శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు గేదెల లక్ష్మణ, ఉపాధ్యక్షుడు మామిడి శంకరరావు, ప్రతినిధులు చందక రాము, సువ్వాడ వాసు, బల్లా భాస్కరరావు, ఎనర్జీ అసిస్టెంట్లు ఉన్నారు.

15న జన జాతీయ గౌరవ దివస్

సీతంపేట రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బిర్సాముండా జయంతి సందర్భంగా ఈనెల 15న జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమాన్ని మెళియాపుట్టి మండలంలో నూతనంగా నిర్మించిన ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహిస్తున్నట్టు ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన అధికారులతో ఆయన సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పీవో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం కలెక్టర్ హాజరయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. గిరిజనులకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు, డీఈ సింహాచలం, పీహెచ్‌వో గణేష్‌బాబు, వెలుగు ఏపీడీ సన్యాసిరావు, డీడీ అన్నదొర పాల్గొన్నారు.

సీతంపేట రూరల్: సీతంపేట ఐటీడీఏలో పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కరవేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పరిధిలోన గిరిజన ప్రజలు తమ సమస్యలపై వినతులు సమర్పించారు. ఏపీవో చిన్నబాబు, గిరిజన సంక్షేమశాఖ ఈఈ రమాదేవి, పీహెచ్‌వో గణేష్‌బాబు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దు

విజయనగరం క్రైం, నవంబరు11: (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలు అప్పగించి ప్రమాదాలకు కారణం కావొద్దని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా ప్రమాదాలు నియంత్రించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టి 579 వాహనాలు సీజ్ చేసి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మైనర్‌లు అయిన పిల్లలకు వాహనాలు ఇచ్చి వారి జీవితాలను నాశనం చేయొద్దన్నారు. లైసెన్సు ఉన్నవారు మాత్రమే వాహనం నడపాలని లైసెన్సు లేకుండా, వాహన పత్రాలు లేకుండా తనిఖీల్లో పట్టుబడితే, వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

బొబ్బిలి: బొబ్బిలి ప్రాంతంలో ఆది, సోమవారాల్లో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న వారిని గుర్తించి 60 వాహనాలను సీజ్ చేసినట్టు ట్రాఫిక్ ఎస్ఐ వి.జ్ఞానప్రసాద్ తెలిపారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలు పాటించని వాహనదారులకు సోమవారం సాయంత్రం అవగాహన కల్పించారు. తనిఖీలు చేసి ఈ-చలానాలు విధించారు. అనంతరం వాహనదారులందరికీ కౌన్సిలింగ్ ఇచ్చారు.

రామభద్రపురం: ప్రతి వాహనచోదకుడు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి ప్రమాదాలకు గురికాకుండా ఉండాలని బొబ్బిలి రూరల్ పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కే.నారాయణరావు సూచించారు. స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో సోమవారం వాహన చోదకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, సెల్‌ఫోను మాట్లాడుతూ వాహనాలు నడిపిన కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఎస్ఐ వెలమల ప్రసాదరావు, హెచ్‌సీ నారాయణ పాల్గొన్నారు.

గజపతినగరం: మైనర్లు వాహనాలు నడుపుతు పట్టుబడితే చట్ట పరమైన చర్యలు తీసు కోవడం జరుగుతుందని సీఐ రమణ హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో మైనర్‌లతోపాటు వారి తల్లి దండ్రులు, వాహనాల రికార్డులు లేకుండా పట్టుబడినవారికి చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై. కె. లక్ష్మణరావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: ప్రతివాహన చోదుకుడు హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని ఎస్.ఐ సాగర్ బాబు అన్నారు. సోమవారం ఆయన అడ్డురోడ్డు కూడలిలో వాహనాల తనిఖీ నిర్వహించారు. అనంతరం వాహనచోదుకులతో సమావేశం నిర్వహించారు. పిల్లలకు వాహనాలు నివ్వరాదన్నారు. అలా పట్టుబడితే కేసులు నమోదు చేస్తామన్నారు.

శృంగవరపుకోట: మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని శృంగవరపుకోట సీఐ వీఎస్ మూర్తి హెచ్చరించారు. సోమవారం స్టేషన్ పరిధిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. శని, ఆదివారం నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో పట్టుబడిన మైనర్లు తల్లి దండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. వాహనాలను అప్పగించారు. రహదారి భద్రత ప్రమాణాలను పాటించడం, హెల్మెట్ దరించడం చేయాలని సూచించారు.

న్యూస్ బాక్స్

జాతీయ స్థాయి కవితల పోటీల విజేతలు వీరే

విజయనగరం రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహాకవి గురజాడ వర్ధంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఏటా నిర్వహించే గురజాడ సాహితీ చైతన్యోత్సవంలో భాగంగా నిర్వహించే జాతీయస్థాయి కవితల పోటీల్లో 140కి పైగా వచ్చిన కవితలలో గురజాడ ఉత్తమ కవితా పురస్కారాన్ని స్వీకరించడానికి ఏడుగురు కవులను ఎంపిక చేశారని గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కవితా పురస్కారానికి ఎంపికైన వారిలో మానాపురం రాజా చంద్రశేఖర్ (విజయనగరం), ఇందిరా వెల్లి(హైదరాబాదు), జీఎల్ఎన్ శాస్త్రి(అనకాపల్లి), సత్యముని నవీన్ జోగులాంబ(గద్వాల్), పద్మజా శంకర్ (గంట్యాడ), మీసాల చిన గౌరునాయుడు(బొబ్బిలి), నరేంద్రబాబు(బెంగుళూరు) ఉన్నారన్నారు. వీరిని ఈ నెల 30న జరిగే కార్యక్రమంలో సత్కరించనున్నట్టు తెలిపారు.

రేపు శిక్షణ

బాడంగి, నవంబరు11(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సోమవారం మండల అధికారులతో ఉల్లాస్(అండర్‌స్టాండింగ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 13న మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

విజయనగరం దాసన్నపేట, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీషు మీడియం తరగతులను ఒకే పాఠశాలలో కొనసాగించేలా చూడాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుకారిబాబు కోరారు. సోమవారం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన 117 జీవోని రద్దు చేయాలని, ప్రాథమిక పాఠశాలలు, వ్యవస్థలను కాపాడాలని, 3, 4, 5 తరగతులను హైస్కూల్ నుంచి తిరిగి ప్రాథమిక పాఠశాలలకు పంపించాలన్నారు. దీనిపై స్పందించిన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, ఈ సమస్యను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తానన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి

దత్తిరాజేరు,నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరపుకొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యులు పి.స్రవంతి, కే.రఘు ఆధ్వర్యంలో గర్భిణులకు తనిఖీలు, రక్తపరీక్షలు, స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు తీసుకోవాల్సిన జా గ్రత్తలను వివరించారు. హెల్త్ ఎడ్యుకేటర్ గిరి బాబు, ఎంపీహెచ్‌వో బి.మురళీ, సీహెచ్‌వో, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు. సత్యసాయి భక్తులు ఎస్.చింత లవలస గ్రామస్తులు పద్మావతి, భాస్కరరావు గర్భిణులకు భోజనాలు ఏర్పాటు చేశారు

66 మందికి కంటి పరీక్షలు

చీపురుపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్లాంలో సోమవాం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 66 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. విజయనగరం పుష్పగిరి ఆసుపత్రి వైద్యుల సహకారంతో మానవీయత సంస్థ ఈ శిబిరాన్ని నిర్వహించింది. 66 మందిలో 27 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వైద్యులు ఆర్. ప్రసాదరావు, మాజీ సర్పంచ్ రామకృష్ణనాయుడు, మానవీయత సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు

రింగురోడ్డు: పేర్లవారి వీధిలో గల సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ ఆఫ్ ది డఫ్ అండె బైండ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బధిరుల పాఠశాలలో సోమవారం ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. చిన్నపిల్లల వైద్యనిపుణులు డి.వి శ్రీకాంత్, ఈఎన్‌టీ వైద్యనిపుణులు నాగమనోహర్ ఆధ్వర్యంలో 60 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు, టానిక్‌లు అందజేశారు.

భవన నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి

రింగురోడ్డు, నవంబరు11(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే భవణ నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరని కమిషనర్ పి.నల్లనయ్య స్పష్టం చేశారు. కమిషనర్ ఆదేశాలతో టీపీఎస్ అనిత ఆధ్వర్యంలో ప్రణాళిక సిబ్బంది సోమవారం ఉల్లివీధిలోని నిర్మాణంలో ఉన్న భవనాల వద్దకు వెళ్లి అనుమతులు, ప్రభుత్వ నిబంధనలు సరి చూశారు. ప్రణాళిక సిబ్బంది కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రకృతి విధానంలోనే సాగుచేయాలి

రామభద్రపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పంటల సాగులో రైతులు ప్రకృతిలో వచ్చిన వనరులను ఉపయోగించి నాణ్యమైన ఉత్పత్తులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రం ఎల్ఐ సూర్యలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం రసాయనిక ఎరువులు, పురుగు మందులు లేకుండా సాగుచేసిన కూరగాయలను ప్రదర్శించారు. మండల వ్యవసాయాధికారి వెంకటయ్య, ఏఈవో కొండలరావు పాల్గొన్నారు.

హోమియో వైద్యంపై అవగాహన

గుర్ల, నవంబరు11(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు హోమియో వైద్యం పై పూర్తిగా అవగాహన కల్పించాలని హోమియో వైద్యులు మధుబాబు అన్నారు. సోమ వారం వైద్య సిబ్బందికి ఆయన హోమియో వైద్యంపై అవ గాహన కల్పించారు. హోమి యో వైద్యం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతి రోగానికి హోమియోలో మందులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

బొబ్బిలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలజంగి గ్రామానికి చెందిన రెడ్డి జగన్నాథం నాయుడు(49) ఆదివారం రాత్రి తన ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్ఐ సన్యాసిరావు కథనం ప్రకారం జగన్నాథం నాయుడు చెడు వ్యసనాలకు బానిసై రెండేళ్ల క్రితం నుంచి భార్యకు దూరంగా ఉంటున్నాడు. దీనితో ఆయన తన ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య రెడ్డి వాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కటకం సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ సన్యాసిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి సోమవారం బొబ్బిలి సీహెచ్‌సీలో పోస్టుమార్టమ్ నిర్వహించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

అగ్ని ప్రమాదంలో వృద్ధురాలి మృతి

దత్తిరాజేరు, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమానాపురం గ్రామానికి చెందిన వృద్ధురాలు అగ్ని ప్రమాదంలో మృతిచెందినట్టు పెదమానాపురం ఎస్ఐ ఆర్.జయంతి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సారిక సింహాచలం(67) సోమవారం తన ఇంటిలో చుట్ట కాల్చుకుని నోటిలో పెట్టుకొని నిద్రిస్తున్న సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో గాయాలపాలైన వృద్ధురాలిని 108 వాహనంలో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్టు ఎస్ఐ తెలిపారు. వృద్ధురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సారా తయారీ కేంద్రాలపై దాడి

విజయనగరం క్రైం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కొత్తవలస మండలం రామలింగాపురం గ్రామ పరిధిలోని కొండవాగు సమీపంలో సోమవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంటు సిబ్బంది సారా తయారీ కేంద్రంపై దాడి చేశారు. ఈ దాడిలో 300 లీటర్ల పులిసిన బెల్లపు ఊటలను ధ్వంసం చేసి సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు ఆదేశాలతో ఈ దాడిలో హెచ్‌సీ రాంబాబు, ఈసీలు రాము, నాయుడు, జనార్దన్ పాల్గొన్నారు.

● విజయనగరం మండలం పెదవేమలి గ్రామ పరిధిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సత్యారావును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంటు ఎస్ఐ ఎస్‌పీ రామారావు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం విజయనగరం సర్కిల్ -2 ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌కు అప్పగించినట్టు తెలిపారు. హెచ్‌సీ నాగేశ్వరరావు, సుదర్శన్‌కుమార్, కానిస్టేబుల్స్ రాము, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

గంజాయి విక్రయదారుల అరెస్టు

విజయనగరం క్రైం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాంపై తనిఖీలు చేస్తుండగా, అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు జీఆర్‌పీ ఎస్ఐ బాలాజీరావు తెలిపారు. తనిఖీల సమయంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన వికాస్‌వర్మ, సతీష్‌కుమార్ పాల్ వద్ద సుమారు 13 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

అక్రమ మద్యంతో వ్యక్తి అరెస్ట్

సంతకవిటి: అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని సంతకవిటి పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. సంతకవిటి మండలం బొద్దూరు గ్రామ సచివాలయం సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్టు ఎస్సై గోపాలరావు తెలిపారు.

ముకుందపురంలో అగ్నిప్రమాదం

సంతకవిటి: మండల పరిధిలోని ముకుందపురంలో జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పశువుల శాలలతో పాటు రెండు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన గడే సంతోష్‌కుమార్‌కు చెందిన 2 పశువుల శాలలు, రెండు ఎకరాల గడ్డివాములు అగ్నికి ఆహుతవడంతో స్థానికులు రాజాం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. సుమారు 50 వేలు రూపాయిలు ఆస్తి నష్టం సంభవించిందని ఫైర్ ఎస్సై టీఎస్ఎస్ జనార్దనరావు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రి పనితీరుపై విచారణ చేయాలి

చీపురుపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి పనితీరుపై జిల్లా న్యాయమూర్తి చేత విచారణ జరపాలని బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ మన్నెపురి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వంద పడకలు గల ఈ ఆసుపత్రిలో పరిపడినంత మంది వైద్యులున్నప్పటికీ, మధ్యాహ్నం ఒంటి గంట వరకే ఓపీ సేవలందుతున్నాయని, మధ్యాహ్నం రెండు తరువాత వచ్చిన రోగుల్ని పట్టణంలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆసుపత్రి పనితీరుపై విచారణ నిర్వహించి, గాడిలో పెట్టని పక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో ఆసుపత్రిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

జామి, నవంబరు11(ఆంధ్రజ్యోతి): ఇటీవల మండలంలోని విజినిగిరి గ్రామానికి చెందిన గనివాడ అచ్చెన్న హత్యకు గురయ్యాడు. అయితే ఇతను మృతిచెందాక పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. అయితే ఈ మృతదేహానికి అంత్యక్రియలు చేసే స్తోమతు వారికి కుటుంబానికి లేకపోవడంతో గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధి బూర్లె నారాయణరావు, గ్రామ సర్పంచ్ సూర్యారావుతో కలిసి రూ.20వేలు అందించి దహన సంస్కారాలు చేయించింది. ఇది చూసిన స్థానికులు వీరిని అభినందించారు.


గర్భిణులకు అన్నదానం

రేగిడి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రేగిడి విశ్వసాయిమందిరం ఆధ్వర్యంలో సత్యసాయిసేవా కమిటీ నెలలో ఒకరోజు గర్భిణులకు అన్నదానం చేస్తోంది. వివిధ గ్రామాలనుంచి రేగిడి పీహెచ్‌సీకి వచ్చే దాదాపు 100 మంది గర్భిణులకు స్థానిక పీహెచ్‌సీ ప్రాంగణంలో ఈ సేవా కార్యక్రమం చేపడుతున్నట్లు విశ్వసాయి మందిరం ప్రతినిధి శివకుమార్ తెలిపారు. వైద్యాధికారి అశిరినాయుడు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే డీఆర్‌ఎంతో కలిశెట్టి సమీక్ష

రాజాం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం కార్యా లయంలో డీఆర్‌ఎంతో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. సమావేశంలో విజ యన గరం పార్లమెంట్ నియోజకవర్గంలోని రైల్వే సమస్యలను పరిష్కరించడంపై వివరణాత్మకంగా చర్చించారు.

కట్నం వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య


ఢిల్లీశ్వరి (ఫైల్)

సీతంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రూ.లక్షల్లో డబ్బు, పెద్దమొత్తంలో బంగారు ఆభరణాలు కట్నంగా తీసుకున్నారు. వివాహం చేసుకుని ఒక బిడ్డను కన్న తర్వాత ఇప్పుడు మరో పెళ్లి చేసుకుంటానని ఒత్తిడి చేయడంతో, ఆ వేధింపులు తాళలేక ఓ వివాహిత బలవన్మరణానికి ప్రయత్నించింది. ఆమె అపస్మారక స్థితిలో ఉన్నప్పటికీ కాపాడుకునేందుకు ప్రయత్నించలేదని, తన కుమార్తెను చంపేశారంటూ మృతురాలి తండ్రి విశాఖపట్నం నాలుగోటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ సమీపంలోని చినమంగళాపురానికి చెందిన కడగల ఢిల్లీశ్వరి (25)కి అక్కయ్యపాలెంలోని రామచంద్రనగర్ నివాసి కడగల రాజశేఖర్‌తో 2002 ఫిబ్రవరి 4న పెద్దల సమక్షంలో వివాహం చేశారు. ఆ సమయంలో రూ.18 లక్షల కట్నం, పది తులాల బంగారు ఆభరణాలు, పెళ్లి ఖర్చుల కింద మరో రూ.5 లక్షలు ఇచ్చారు. వివాహం అనంతరం ఢిల్లీశ్వరి, రాజశేఖర్‌లు అన్యోన్యంగా జీవితం గడిపారు. ఈ క్రమంలో వారికి ఒక బాబు పుట్టాడు. పెళ్లి జరిగిన కొద్ది రోజుల నుంచి ఇంకా డబ్బులు, బంగారం కావాలని అత్త, భర్త వేధించేవారు. కొద్ది రోజుల క్రితం వ్యాపారం నిమిత్తం డబ్బులు కావాలని అడగడంతో ఢిల్లీశ్వరి తండ్రి కిమిడి సూరిబాబుకు తెలిపింది. దీంతో అప్పు తెచ్చి రూ.6 లక్షలు ఇచ్చారు. కొద్దికాలంగా ఢిల్లీశ్వరిని కొట్టేవారని, ఒక్కోసారి తమ ఇంటికి పంపేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ఇంటి నుంచి వెళ్లిపోవాలని, మరో పెళ్లి చేసుకుంటానంటూ ఢిల్లీశ్వరిని భర్త వేధించేవాడు. ఈ విషయాన్ని ఆమె తన తల్లిదండ్రులకు ఫోనులో తెలిపింది. దీంతో ఈ విషయాన్ని అప్పట్లో పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. తన కుమార్తెను వేధించవద్దని ఢిల్లీశ్వరి తల్లిదండ్రులు వేడుకునేవారు. భర్త, అత్త వేధింపులు పెరగడంతో తాళలేక ఢిల్లీశ్వరి ఆదివారం ఇంట్లో ఉన్న ఓ ద్రావణం తాగింది. ఈ విషయం తెలిసినా ఆమె భర్త రాజశేఖర్ అత్తమామలకు విషయం చెప్పలేదు. అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న వారు ఢిల్లీశ్వరి ఆత్మహత్యకు పాల్పడిందని ఆమె తల్లిదండ్రులకు తెలిపారు. వారు వచ్చి బంధువుల సహాయంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చెయ్యి దాటడంతో ఢిల్లీశ్వరి మృతి చెందింది. దీంతో ఆమె తండ్రి సూరిబాబు నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఢిల్లీశ్వరి భర్త రాజశేఖర్, అత్త ఉమామహేశ్వరిల వేధింపులే కారణమని ఆరోపించారు. ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి, సీఐ ఎస్.విజయ్‌కుమార్‌లు ఘటన స్థలానికి వెళ్లి విచారించి నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీశ్వరి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

తక్కువ ఎత్తులోనే ట్రాన్స్‌ఫార్మర్లు

- పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని విద్యుత్ అధికారులు



చిన్నయ్యపేటలో తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



ఎంఆర్‌పేటలో ప్రమాద స్థితిలో ట్రాన్స్‌ఫార్మర్

రేగిడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొన్ని గ్రామాల్లో విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్లు అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. సింగిల్ ఫేజ్, 11 కేవీ లైన్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు నేలకు దగ్గరగా ఉండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల చిన్నయ్యపేటలో ఒక విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ తగిలి రెండు గొర్రెలు మృత్యువాతపడిన ఉదంతం తెలిసిందే. ఇక్కడ భూయాజమాని తన స్థలాన్ని ఎత్తు చేసుకోవటంతో ట్రాన్స్‌ఫార్మర్ నేలకు చాలా దగ్గరకు చేరుకుంది. ఇది ప్రమాదాలకు కారణమవుతోంది. అయినా విద్యుత్‌శాఖ పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇది ఇలా ఉంటే మజ్జిరామునిపేట, గోపంపేట, కందిశ రూట్‌లో ఉన్న కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు సైతం ఇదే స్థితిలో కనిపిస్తున్నాయి. ఈ ట్రాన్స్‌ఫార్మర్లు చాలా ఎత్తులో ఉండాల్సి ఉన్నప్పటికీ ఇక్కడ పరిస్థితులు విరుద్ధంగా ఉన్నాయి. కొన్ని చోట్ల భూమికి ఐదారు అడుగుల ఎత్తులోనే ఉండడం ప్రమాదకరం. వీటిపై సరైన రక్షణ చర్యలు తీసుకుని ప్రమాదాల నుంచి అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత విద్యుత్‌శాఖాధికారులను ఆంధ్రజ్యోతి ప్రశ్నించగా ట్రాన్స్ ఫార్మర్లను పరిశీలించి రక్షణచర్యలు తీసుకుంటామని తెలిపారు.

అసభ్యకర పోస్టులపై ఫిర్యాదు

విజయనగరం క్రైం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ సోషల్ మీడియా నాయకులు టీడీపీ నాయకులపైన అసభ్యకర పోస్టులు పెడుతున్నారని అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే భాషా కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టూటౌన్ పోలీసు స్టేషన్‌లో వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధి డాక్టరు ప్రభాకరరెడ్డి అలియాస్ పంచ్ ప్రభాకర్ తన యూట్యూబ్ ఛానల్‌లో అసభ్యకర పోస్టులు పెట్టారని, దీనిపై కేసు నమోదు చేసి, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. దీనిపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

- భోగాపురం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్‌లపై సోషల్ మీడియాలో గుర్తు తెలియని వ్యక్తి అసభ్య కరంగా పోస్టులు పెట్టడంపై జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వందనాల రమణ సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని సీఐ ఎన్వీ ప్రభాకర్ తెలియజేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

నీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం



అధికారులతో చర్చిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

మెంటాడ (ఆంధ్రజ్యోతి) నవంబరు 11: మండలంలోని 3 మధ్య తరహా, 11 చిన్న తరహా నీటి సంఘాలకు ఈనెల 21న ఎన్నికలు జరుగుతాయని తహసీల్దార్ కె.శ్రీనివాసరావు చెప్పారు. సంబంధిత ఎన్నికల అధికారులు ముందురోజు నోటిఫికేషన్ జారీ చేస్తారని అన్నారు. ఎన్నికలు జరిగే నీటి సంఘాలు వివరాలను ఆయన వెల్లడించారు. ఆంధ్ర లెఫ్ట్ కెనాల్, రైట్ సైడ్ కెనాల్, మెంటాడ చానల్ సిస్టం, బడేవలస ఆమిమ్ దొర ట్యాంకు, కొంపంగి కూనేటిగెడ్డ సిస్టం, కుంతినవలస ఏటిగెడ్డ చానల్ సిస్టం, పోరాం ఉద్దంగి సిస్టం, జక్కువ సమంత సాగరం ట్యాంక్, పెదమేడపల్లి ముఠా చానల్ సిస్టం, కొండ లింగాలవలస నీలయ్యమ్మ చానల్, కంతుభుక్త వలస బర్లవాని ట్యాంక్, పోరాం ఊర ట్యాంక్, వానిజ యర్ర ట్యాంకు, గుర్ల తమ్మిరాజుపేట గుర్లగెడ్డ చానల్ సిస్టం ఉన్నాయని తహసీల్దార్ అన్నారు. ఓటర్ల జాబితాలను గ్రామ సచివాలయాలు, పంచాయతీ లు, తహశీల్దార్, ఇరిగేషన్ కార్యాలయాల్లో ప్రదర్శించారని చెప్పారు. నీటి పన్ను బకాయిలు ఉన్నవారు పోటీకి అనర్హులని స్పష్టం చేశారు. ఎన్నికలను ప్రశాంతంగా జరిపేందుకు మండల ప్రజలు, అధికారులు సహకరించాలని కోరారు.

అద్దె బకాయిలు తక్షణమే చెల్లించాలి

రింగురోడ్డు, నవంబరు11(ఆంధ్రజ్యోతి): విజయనగరం నగరపాలక సంస్థ ఆధీనంలో ఉన్న దుకాణాల దీర్ఘకాలిక అద్దె బకాయిలను ఎట్టి పరిస్థితిల్లోనూ ఉపేక్షించబోమని కమిషనర్ పి.నల్లనయ్య స్పష్టంచేశారు. సోమవారం కమిషనర్ ఆదేశాలతో ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో ఉన్న కొన్ని దుకాణదారులు అద్దెబకాయిలు చెల్లించకపోవటంతో దుకాణాలకు తాళాలు వేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ ఆస్తి పన్నులు, దుకాణాల అద్దె చెల్లింపుల ద్వారా నగరపాలక సంస్థకు రావాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని తెలిపారు. మూడునెలలు, అంతకన్నా ఎక్కువ కాలం అద్దెబకాయిలు ఉన్నట్లయితే ఆ దుఖాణాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. కాబట్టి త్వరితగతిన అద్దెబాకాయిలను చెల్లించాలని కోరారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సాయి ప్రసాద్, చిన్నంనాయుడు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం జేసీరాజు

రామభద్రపురం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): విద్యతోనే సామాజాభివృద్ధి సాధ్యమని నాయుడువలస పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కారుణ్య ఫౌండేషన్ ఛైర్మన్ జేసీ రాజు విద్యార్థులకు సూచించారు. సోమవారం పాఠశాలలో స్వతంత్ర భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి, భారతరత్న డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యాదినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా మౌలానా ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు విద్య ప్రాముఖ్యత-ఉపయోగాలు అనే విషయంపై వకృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు కృష్ణంనాయుడు, బొప్పే రవికుమార్, వెంకటరమణ, సత్యం, టి.కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమతో రైతు ఆర్థికాభివృద్ధి

డెంకాడ, నవంబరు 11: రైతుల ఆర్థికాభివృద్ధి వ్యవసాయంతో పాటు, పాడి పరిశ్రమతో సాధ్యమవుతుందని పశు సంవర్థక శాఖ ముఖ్య కార్యదర్శి ఎంఎం నాయక్ అన్నారు. రఘుమండ పశువైద్యశాలను ఆయన సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన అఖిల భారత పశుగణన పురోగతిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా పశు సంవర్థక శాఖ జేడీ వైవీ రమణ, రఘుమండ పశు వైద్యాధికారి ఎన్.సాగర్, అక్కివరం పశు వైద్యాధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను తిలకిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను కలెక్టర్ అంబేద్కర్ తిలకించారు. ఉత్పత్తులపై ఆరా తీసి, కూరగాయల విత్తనాలను కలెక్టర్ కొనుగోలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ రామారావు, ప్రకృతి వ్యవసాయ ఏడీ ఆనందరావు తదితరులున్నారు.

ఘనంగా దేవీ దండుమారమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న ఎస్పీ వకుల్ జిందాల్ దంపతులు

విజయనగరం క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పోలీసు బ్యారక్స్ ఆవరణలో కొలువై వున్న శ్రీదేవి దండుమారమ్మ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందాల్ దంపతులు, బెటాలియన్ కమాండెంట్‌ంట్ మల్లికా ఖార్గ్ దంపతులు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వహిస్తున్న అమ్మవారికి పంచామృతాభిషేకం, చండీపారాయణం, మండ పారాధన, సహస్ర కుంకుమార్చన, చండీహోమం, మహా పూర్ణాహుతి కార్యక్రమాల్లో ఎస్పీ వకుల్ జిందాల్ దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సౌమ్యలత, నాగేశ్వరరావు, సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కె చౌదరి, బి.వెంకటరావు, ఎల్.అప్పలనాయుడు, ఆర్ఐలు గోపాలనాయుడు, ఆర్ రమేష్‌కుమార్, శ్రీనివాసరావు, ఆర్ఎస్ఐలు, కమిటీ సభ్యులు తాతరాజు, రవిశ్వీరుడు, అప్పన్న, శివశంకర్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రంపెట్ స్థల పరిశీలన

భోగాపురం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): అమటాం రాయవలస సమీప జాతీయ రహదారి ట్రంపెట్ స్థలాన్ని ఎన్‌హెచ్, రెవెన్యూ అధికారులు సోమవారం పునఃపరిశీలన చేశారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటులో భాగంగా జాతీయ రహదారి సమీపంలో ఎయిర్‌పోర్టు నుంచి వచ్చే పోయే వాహనాలకు, జాతీయ రహదారిపై నుంచి రాకపోకలు సాగించే వాహనాలకు ఇబ్బందులు లేకుండా రహదారి ఏర్పాటుకు గతంలో ట్రంపెట్ పరిధిలో సుమారు 9 ఎకరాలు సేకరించారు. అయితే మళ్లీ ట్రంపెట్ సమీపంలో తీసుకున్న స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాట్ల కీర్తి, తహసీల్దార్ ఎం.సురేష్, ఎన్‌హెచ్ అధికారులు, సర్వేయర్ శివాజీ, హెచ్‌డీటీ గాంధీ పాల్గొన్నారు.

దేశ వ్యాప్తంగా గురుదేవ సేవలు

కొత్తవలస, నవంబరు11(ఆంధ్రజ్యోతి): గురుదేవ చారిటుల్ ట్రస్టు సేవలు దేశవ్యాప్తంగా విస్తరించాయని గ్లోబల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బూపటిరాజు పండేటి అన్నారు. సోమవారం రాష్ట్ర లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీతో కలసి సందర్శించారు. ముందుగా ట్రస్టు ద్వారా దివ్యాంగులకు అందిస్తున్న కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని సందర్శించారు. గురుదేవ ఆసుపత్రిని, విజయలక్ష్మి మెమోరియల్ క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలన చేశారు. చైర్మన్ రాపర్తి జగదీష్ బాబు ఈ సందర్భంగా అతిథులు 50 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో 70 మంది అందులకు పించన్ సొమ్ము అందచేశారు. ట్రస్టు వైస్ చైర్మన్ వి.ఫణీంద్ర, వైద్యులు రాఘవేంద్ర, కుమార్ పాల్గొన్నారు.

సర్వేను వేగవంతం చేయాలి



సర్వేపై ప్రజలకు వివరిస్తున్న ఎంపీడీవో

బాడంగి, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాడంగి, పిన్నవలస గ్రామాల్లో ఐహెచ్‌హెచ్ఎల్, హౌస్‌హోల్డ్ జియో ట్యాగ్‌ను ఎంపీడీవో ఎస్.రామకృష్ణ పరిశీలించారు. ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణతో ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఇప్పటివరకు ఐహెచ్‌హెచ్ఎల్ సర్వే అన్ని పంచాయతీల్లో ముమ్మరంగా సాగుతుందన్నారు. అలాగే హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ మండలం మొత్తం 15వేల 645 గృహాలకు 7వేల పైచిలుక గృహాలకు జియో ట్యాగింగ్ పూర్తయిందని, మరో రెండు రోజుల్లో సర్వేను మరింత వేగంగా పూర్తిచేయనున్నట్టు తెలిపారు. ఇంటింటికి వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

రోడ్డు పనుల పరిశీలన

రాజాం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలం రాజీయ్యపేట గ్రామంలో ఎన్‌ఆర్ఈజీఎస్ పథకం ద్వారా చేపడుతున్న గ్రావెల్ రహదారి, డ్రైనేజీ పనులను ఎంపీడీవో శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టకపోతే బిల్లులు చెల్లించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సిబ్బంది, పంచాయతీ సర్పంచ్ రగుమండల గణపతి నాయుడు తదితరులున్నారు.

సీఈవో సందర్శన

నెల్లిమర్ల, నవంబరు11(ఆంధ్రజ్యోతి): జడ్పీ సీఈవో బీవీ సత్యనారాయణ సీతారామునిపేట గ్రామాన్ని సోమవారం సందర్శించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. తాగునీటి పైపులైన్లు, వ్యక్తిగత మరుగుదొడ్ల పై జరుగుతున్న సర్వేను పరిశీలించారు.

సీఎంను కలిసిన బంగార్రాజు

భోగాపురం, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు సోమవారం మంగళగిరిలోని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంపై పలు విషయాలు మాట్లాడినట్టు తెలిపారు.

జలజీవన్ పనులు పూర్తి చేయాలి

భోగాపురం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ కవిత సూచించారు. సోమవారం స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో సిబ్బంది, కాంట్రాక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అసంపూర్తిగా వదిలేసిన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతిఇంటికీ పైపులైన్లు ఏర్పాటు చేసి ట్యాప్‌లు బిగించాలన్నారు. జలజీవన్‌మిషన్ పనులకు మొదటి ఫేజ్‌లో డివిజన్‌లో 2,300 పనులకు గాను రూ.900కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జె.వైకుంఠనాయుడు పాల్గొన్నారు.

శిశు మరణంపై విచారణ

చీపురుపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి పట్టణంలోని బాబూజీ ఆసుపత్రిని జిల్లా ఇన్‌చార్జి డీఎంఅండ్‌హెచ్‌వో రాణి సోమవారం సందర్శించారు. ఈ నెల 8న ఆసుపత్రిలో జరిగిన శిశు మరణానికి సంబంధించి విచారణ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు, ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడారు. బాధితుల బంధువులతో మాట్లాడి, ఆ రోజు జరిగిన ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

100 రోజుల ప్రగతిపై నివేదికలు సిద్ధం చేయాలి

- కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వందరోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుపై నివేదికలను రెండు రోజుల్లో సిద్ధం చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. కార్యాచరణ ప్రణాళిక ప్రగతిపై కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల ప్రగతిని పరిశీలించారు. వ్యవసాయ, ఉద్యాన, గృహ నిర్మాణం బిందు తుంపర సేద్యం తదితర శాఖల ప్రగతిపై ఆరా తీశారు. బుధవారం నాటికి సమగ్ర నివేదికలను అందజేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ సేతుమాధవన్, సీపీవో బాలాజీ తదితరులు ఉన్నారు.

పోలీసుల అదుపులో పశువుల వాహనాలు

నెల్లిమర్ల, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నెల్లిమర్ల సమీపంలో అక్రమంగా పశువులను తరలిస్తున్న రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గణేష్ సోమవారం తెలిపారు. గుర్ల నుంచి నెల్లిమర్ల మీదుగా అలమండకు పశువులు తరలిస్తుండగా వాహనాల తనిఖీల్లో భాగంగా ఈ రెండు వాహనాలను గుర్తించి, అదుపులోకి తీసుకున్నామని ఆయన చెప్పారు. ఈ రెండు వాహనాల్లో ఉన్న 21 పశువులను గోశాలకు తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

పనిభారం తగదు

- వీఆర్వోల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వీఆర్వోలు

గరుగుబిల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమపై పనిభారం తగ్గించాలని వీఆర్వోలు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ పి.బాలకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వీఆర్వోల సంఘ అధ్యక్షుడు ఎం.ధనుంజయ రావు, ఉపాధ్యక్షుడు వి.శ్రీనివాస్, కార్యదర్శి ఎం.గౌరీశంకరరావు, ట్రెజరర్ వి.కరుణాకర్, కె.రాఘవరావులు మాట్లాడారు. వీఆర్వోలకు ఇతర శాఖల పనులు అప్పగించడంతో విధులు కష్టతరంగా మారాయని తెలిపారు. ఈ విషయాన్ని రాష్ట్ర సీసీఎల్ఏ ఉన్నతాధికారులకు తెలియపర్చగా వీఆర్వోలకు ఇతర పనులు అప్పగించవద్దని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ ఆదేశాలను దిగువ స్థాయిలో అమలుపర్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించి న తహసీల్దార్ సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తానని చెప్పారు. వినతిప త్రం అందించిన వారిలో జేడీ పి.రామకృష్ణ, బుచ్చిబాబు తదితరులు ఉన్నారు.

సాగుకు సాయమేదీ?

పాలకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తక్షణమే సాగు సాయం రూ.20 వేలు రైతులకు విడుదల చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేర కు సోమవారం స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటపల్లి కాలువల ఆధునికీకరణ పనులు పునః ప్రారంభించి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. జంపరకోట రిజర్వా యర్ పెండింగ్ ప్రాజెక్టుకు కావాల్సిన నిధులు ఇచ్చి పూర్తి చేయాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో రైతు సంఘం నాయకులు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షు డు కిమిడి రామ్మూర్తినాయుడు ఉన్నారు.

రాజకీయ వేధింపులు ఆపాలి

- ఎండీఎం కార్మికుల నిరసన

బెలగాం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని మిడ్ డే మీల్స్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ముందు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకురాలు వై.శాంతికుమారి మాట్లాడు తూ తమపై రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని కోరారు. ఎండీఎం కార్మికులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మిడ్ డే మీల్స్ కార్మికులు